యుగంధర్ చటుక్కున తలెత్తి పట్టాభి వేపు చూశాడు. మంత్రి పట్టాభి మైక్‌ని యుగంధర్ ముందుకు జరిపాడు. తన అనుమానం అనుమానంగానే వుండిపోయింది. అయినా తప్పదనిపించింది. మైక్ చేతిలోకి తీసుకున్నాడు.

"ఇక్కడ సమావేశమైన పురజనులందరికీ విన్నపం. జస్ట్ రెండు నిమిషాల క్రితం ఉష అనే రిపోర్టర్ ఈ లాటరీ రిలయబులే అని రుజువు చేస్తే బావుంటుందని ఓరల్ కంప్లయింట్ యిచ్చారు. నా డ్యూటీ ప్రకారం లాటరీ బాక్స్‌ని చెక్ చేశాను. ఇందులో ఫ్రాడ్ లేదని నాకనిపించింది" అన్నాడు యుగంధర్ .

వెంటనే మంత్రి పట్టాభి యుగంధర్ చేతిలో మైక్‌ని తన చేతిలోకి తీసుకుని" నా ప్రియమైన ప్రజలారా! అసలు నాకూ లాటరీ రిలయబులే అని నిర్ధారించుకోవాలనిపించింది. ఈ లోపు సిన్సియర్ పోలీసాఫీసర్ మిస్టర్ యుగంధర్ దాన్ని నిర్ధారించటం నాకు ఆనందంగా వుంది. నన్ను ఈ కంపెనీ వాళ్లు ఆహ్వానించినప్పుడే చెప్పాను స్కీమ్స్ అన్ని నిజాయితీగా వుండాలని. ఈ ఫైనాన్స్ కం పెనీ నా నియోజకవర్గ ప్రజల్ని మోసం చేయదని నమ్మకం కుదిరాకే ఓపెనింగ్‌కి వచ్చాను ఇప్పుడు లాటరీ తీయబోతున్నాను. మీ మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి" అంటూ యుగంధర్ కేసి చూసి నవ్వాడు. ఆ నవ్వులోని వ్యంగ్యాన్ని యుగంధర్ పసిగట్టాడు.

సరిగ్గా అదే సమయంలో అందరూ మంత్రికేసి చూస్తుండగా మంత్రి యుగంధర్ కేసి, మంత్రి వెనుకగా నిలుచున్న ఓ వ్యక్తి ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకుని ఆ బాక్స్‌ని చటుక్కున తిరగేసి పెట్టాడు. అందరి దృష్టి ఆ బాక్స్‌పై పడే లోపే ఆ పని జరిగిపోయింది.

రెండువేపులా ఒకేరకంగా వున్న ఆ పెట్టె ఎవరికీ ఎలాంటి అనుమానం కలిగించలేదు. ఒకరు పెట్టెని ఓపెన్ చేశారు. మంత్రిగారు చేయి పెట్టి ఆ స్లిప్స్‌ని కదిలించి అందులోంచి ఒక స్లిప్‌ని విప్పదీసి నెంబర్ 36 అన్నాడు.

అందరూ చూస్తుండగానే పట్టాభి మనిషి 36 నెంబర్ రిసీప్టుని చేత్తో పైకెత్తి పట్టుకుని దాన్ని యుగంధర్ చేతిలో పెట్టాడు. అతను దాన్ని పరిశీలనగా చూస్తుండగా లాటరీబాక్సు తిరిగి తల్లక్రిందులు చేయబడింది.

యుగంధర్ లాటరీ వచ్చిన వ్యక్తి పేరును ఎనౌన్స్ చేసి చటుక్కున వెనుకకు తిరిగి "మరోసారి పెట్టెను తనిఖీ చేయాలి" అన్నాడు సీరియస్‌గా.

"ష్యూర్ ష్యూర్... అది అవసరం కూడా" అన్నాడు మంత్రి.

అతను పెట్టెలో వున్న 200 స్లిప్స్‌ని తీసి ఒక్కొక్కటి పరిశీలనగా చూస్తూ పెట్టెలో పడేస్తున్నాడు. రెండు నిముషాలకు మొత్తం స్లిప్స్ చూడటం పూర్తయింది వాటిలో 36 నెంబర్ స్లిప్ మాత్రమే లేదు.

"వాట్ మిస్టర్ ఎస్.పి. ఈజిట్ కరెక్ట్" అడిగాడు మంత్రి పట్టాభి .

"కరక్టే సార్" అన్నాడు అప్పటికి పూర్తి నమ్మకం కుదిరిన యుగంధర్ .

అందరూ 36 నెంబర్ స్లిప్ వ్యక్తికేసి అసూయగా చూస్తుండగానే అతను మంత్రినుంచి

కారు కీ తీసుకుని డయాస్ దిగి వెళ్ళి కారుడోరు ఓపెన్ చేసి డ్రయివింగ్ సీట్లో కూర్చుని కారును ముందుకు దూకించాడు.

0 0 0

ఎస్.పి ఆఫీస్....

యుగంధర్ ఏదో ఫైలు చూస్తూండగా ఫోన్ మ్రోగింది. చటుక్కున ఫోన్ ఎత్తాడు.

"నేను... మంత్రి పట్టాభిని నీకంటే రెండాకులు ఎక్కువ చదివినవాడిని" ఆ వేపు నుంచి మంత్రి పట్టాభి నవ్వుతూ అన్నాడు.

"చదవబట్టేగదా మంత్రి అయ్యారు, ఇంతకీ ఫోన్ ఎందుకు చేశారు?" ఎస్.పి. మర్యాదగా అడిగాడు.

"చెబుతా. విను తొలి ప్రయత్నంలోనే ఎలా ఫూల్‌ని చేశానో చెప్పకపోతే నాకు నిద్రపట్టదు. నీకు నా సత్తా ఏమిటో తెలియదు".

"వాడ్డూ యు మీన్?" యుగంధర్ కోపంగా ప్రశ్నించాడు.

"ఐ మీన్... నీతో ఆ లాటరీ న్యాయమైందేనని ఎనౌన్సు చేయించి నా మనిషికే కారు వచ్చేలా చేశాను. అది మన సత్తా" పట్టాభి నవ్వాడు.

యుగంధర్‌కు ఓ క్షణం అతనేమన్నాడో అర్థం కాలేదు "అది అసంభవం, నేను లాటరీ తీయటానికి ముందు-తీశాక పూర్తిగా చెక్ చేశాను. కారు వచ్చిన వ్యక్తి యాక్సిడెంటల్‌గా నీ వాడు కావచ్చు. అంతమాత్రాన అది మీ సత్తా ఎలా అవుతుంది?" యుగంధర్ కాస్త సీరియస్‌గా అన్నాడు.

"అదే చెబుతాను, నీ అనుమానం మేం రెండు పెట్టెలు చేయించామని- ఒక పెట్టెలో ఒకటినుంచి రెండొందలు వరకు నెంబర్లు వేసిన స్లిప్స్ వుంటాయని, మరో పెట్టెలో అన్ని స్లిప్స్‌మీద 36 నెంబర్ వేసి వుంటుందని.

నిజమే, అలాగే చేయించాడు మధుమూర్తి. కాని నేను మధుమూర్తి కన్నా నాలుగాకులు ఎక్కువ చదివినవాడ్ని కదా? అందుకే రెండుపెట్టెల రాజకీయంకన్నా ఒక పెట్టె రాజకీయమే గొప్పదని ప్లాన్ చేశాను.

ఆ పెట్టెకు క్రింద, పైన ఒక రకంగానే చేయించాను. నీవు ముందు చెక్ చేసినప్పుడు పెట్టె 'ఎ' సైడ్ నిలబెట్టి వుంది. అప్పుడు నువ్వు అది కరక్టే అని ఎనౌన్స్ చేసేందుకు జనం వేపు తిరిగినప్పుడు పెట్టె తిరగబడింది. అప్పుడు నేను స్లిప్ తీశాను.' బి' సైడ్ అరలో అన్నీ 36 నెంబర్ గల స్లిప్సే ఉన్నాయి. నేనో స్లిప్ తీశాను. దాన్ని నీతోనే ఎనౌన్స్ చేయించాను. అది 36, తిరిగి నీకు అనుమానం వస్తుందని కూడా నాకు తెలుసు.

అందుకే పెట్టే రెండోసారి తిరగబడింది. అప్పుడు మరలా చెక్ చేశావు అందులో 36

నెంబర్ స్లిప్ లేదు.

దాంతో లాటరీ న్యాయబద్ధంగానే ఉందని తిరిగి ఎనౌన్స్ చేశావు. నీకు తలకాయ వుండివుంటే, మొదటిసారి చెక్ చేసినప్పుడే జాగ్రత్తగా లెక్కేసి వుంటే, అందులో 199 స్లిప్స్ వుండేవి? ఆ మిస్ అయిన స్లిప్ 36 అని గుర్తించేవాడిని.

నాది రెండు పెట్టెల రాజకీయం. ఒక పెట్టెలో రెండు అరల రాజకీయం. జాగ్రత్త ముందు ముందు మాకు ఎదురు తిరిగావో ఇలాగే వుంటుంది నా దెబ్బ, ఖబడ్దార్" ఫోన్ కట్ అయింది ఆ వేపు.

ఒక్కసారి షాక్ తిన్నాడు యుగంధర్ . ఎంత తెలివిగా తన మనిషికే వచ్చేలా చేసుకోగలిగాడు? నిజం తెలిసినా ఇప్పుడిక తను చట్టపరంగా చేయగలిగిందేమీ లేదు. తనే అ లాటరీ విధానం న్యాయబద్దంగా వుందని జనాలముందు సర్టిఫై చేశాడు.

అప్పుడు కాదంటే తనే ఇరుకున పడతాడు. నిజంగానే నువ్వు గుండెలు తీసిన బంటువే పట్టాభీ! డ్యూటీలో జాయిన్ అయిన మొదటిరోజే గొప్ప జోల్డ్ ఇచ్చి నీ సామర్ధ్యాన్ని రుజావు చేసుకున్నావు.

నా సత్తా ఏమిటో కూడా రుచి చూద్దువుగాని, యుగంధర్ చప్పున ఆలోచనల్నుంచి తేరుకుని బెల్ నొక్కాడు.

పి.ఏ రాగానే యాంటిగూండా ఎస్.ఐని రమ్మని చెప్పాడు కూల్‌గా.

పి.ఏ వెళ్లిపోగానే పాత రికార్డ్సు తెప్పించుకుని ఒక్కొక్కటే పరిశీలనగా చూడటం మెదలెట్టాడు. సరిగ్గా అరగంటకు యాంటి గూండా ఎస్.ఐ. దినకర్ వచ్చి యుగంధర్‌కి సెల్యూట్ చేసి నుంచున్నాడు.

"ఇప్పుడే పాత రిపోర్ట్స్ అన్నీ చూశాను. ఈ సిటీలోనే రహస్యంగా దొంగసారా తయారు చేసి ఇతర ప్రదేశాలకు ట్రాన్స్‌పోర్టు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే గంజాయి, బ్రాకెట్, క్యాబరే డ్యాన్సులు, ప్రాస్టిట్యూషన్, అన్నీ, ఇక్కడ బలంగా పాతుకుపోయి దుర్గంధభూయిష్టం వేస్తున్నాయి. ఇంతవరకు మీరెందుకు గట్టిచర్య తీసుకోలేదో-ఐ కాంట్ అండర్ స్టాండ్. జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుంచయినా స్ట్రిక్టుగా వ్యవహరించక తప్పదు".

దినకర్ ఆశ్చర్యపోతూ చూశాడు యుగంధర్‌ని. "సిటీనుంచి బయటకు వెళ్ళే రహదారుల్ని ట్రేస్ చేయండి. దొంగ రహదారులపై అన్నిచోట్లా నిఘా ఎక్కువ చేయండి".

"సార్" దినకర్ సందేహిస్తున్నట్లుగా చిన్నగా అన్నాడు.

"ఎస్, చెప్పండి ఎనీప్రాబ్లమ్?" అతను సూటిగా చూస్తూ అన్నాడు.

"మనకు తగినంత స్టాఫ్ లేదు. వెహికల్స్ కూడా లేవు" దినకర్ మెల్లగా అన్నాడు. అందువలనే డ్యూటీ సక్రమంగా చేయలేకపోతున్నామనే భావాన్ని వ్యక్తపరుస్తూ.

"ఆ విషయాన్ని ఇంతకు ముందున్న ఎస్.పి.కి తెలియచెప్పారా?"

"తెలియచేశాం సార్. ఫైనాన్షియల్ ప్రాబ్లమ్ అని మా నోట్‌ని డి.ఐ.జి.గార్కి పంపలేదు

సార్''.

యుగంధర్ సీటులోంచి లేచి మెత్తటి తివాచీమీద పచార్లు చేస్తూ మౌనంగా వుండిపోయాడు.

"సీ జెంటిల్ మెన్...." అతను ఎస్.ఐ.పేరు తెలీక ఒకింత సేపు ఆగాడు.

"దినకర్ సర్"

"ఎస్ మిస్టర్ దినకర్, మనం యువకులం. మనకు తెలివితేటలున్నాయని, శక్తిసామర్థ్యాలున్నాయని, నిజాయితీపరులమనే ప్రభుత్వం మనకీ ఉద్యోగాలు యిచ్చింది" యుగంధర్ అంతరంగం దినకర్‌కి అర్ధమయి పోయింది.

"నాకు నిజాయితీ లేక, శక్తిసామర్థ్యాలు లేక కాదు సార్ ఏంచేయలేకపోతోంది" సంజాయిషీగా అన్నాడు దినకర్.

"మరి?"

"ధైర్యంలేక, స్టాల్‌వర్ట్సుని ఎదుర్కోలేక--"

"వాడ్డూ యూ మీన్, ఎందుకు భయపడటం? సంఘ విద్రోహ చర్యలకి కారకులయిన బాస్టర్డ్స్‌ని చూసి ఎన్నో అధికారాలున్న మనం భయపడటమా? షేమ్ ఆన్ యువర్ పార్ట్" యుగంధర్ అసహనంగా అన్నాడు.

అతను మౌనంగా వున్నాడు

"ఎవరు మిమ్మల్ని అంతగా భయపెట్టేది"

యుగంధర్ అలా సూటిగా ప్రశ్నిస్తాడని ఊహించని దినకర్ ఓ క్షణం కలవరపడ్డాడు.

"చెప్పండి ఫర్వాలేదు."

"వాళ్లు చాలా డేంజరస్ సార్. ఎదురుతిరిగారని మన స్టాఫ్‌ని కూడా మాయంచేశారు అంతటి సమర్థులు సార్ వాళ్లు."

"సూటిగా చెప్పండి, ఎవరు వాళ్ళు?" నిలదీసినట్లు అడిగాడతను.

"మధుమూర్తి, పట్టాభి " నసుగుతూ చెప్పాడు దినకర్.

కొద్దిక్షణాలు అక్కడ నిశ్శబ్దం అలుముకుంది.

"ఈ రోజే కొత్త స్టాఫ్‌ని రిక్రూట్ చేసుకునేందుకు ఐ.జి. గార్కి పర్మిషన్‌కోసం లెటర్ రాస్తాను. ఇక కారణాలు, భయాలు చెప్పవద్దు నాకు. డూ యువర్ డ్యూటీ. దట్సాల్. ఎవరికీ భయపడనక్కరలేదు. ఎవరినీ వదిలిపెట్టవద్దు. ఇక్కడ ఇన్‌ఫార్మర్స్ ఎవరన్నా వున్నారా?"

" ప్రత్యేకంగా లేరుగాని అప్పుడప్పుడు పేరు చెప్పకుండా ఇన్‌ఫర్మేషన్ అందిస్తుంటారు సార్."

"ఓ.కే, వెంటనే రంగంలోకి దిగిపోండి. మీ వెనుక నేనుంటాను" యుగంధర్ సీట్లో కూర్చుంటూ అన్నాడు.

దినకర్ సెల్యూట్ చేసి బయటకు వెళ్ళబోతూ ఒకక్షణం ఆగాడు, యుగంధర్ చటుక్కున

తలెత్తి ఏమిటన్నట్లు కనుబొమ్మలు ఎగురవేశాడు.

"వాళ్ళని ఢీకొనటం ప్రమాదకరం సార్, మరోసారి ఆలోచించండి" అన్నాడు మెల్లగా.

"డూ---వాట్--ఐ----సే" కోపంగా అన్నాడు యుగంధర్. దినకర్ వెళ్ళిపోయాడు.

వెంటనే పి.ఏ.ని పిలిచి ఎక్కువ స్టాఫ్‌కోసం నోట్ డిక్టేట్ చేయటం మొదలు పెట్టాడు.

0 0 0

"ఏరా అందగాడా? కారెలా వుంది" మంత్రి పట్టాభి అప్పుడు మూడో పెగ్‌లో వున్నాడు.

"అయ్యబాబోయ్! ఎంత మాటండీ, తమరి దయతో బతికేవాడ్ని. ఆ కారు నాకొద్దండీ. అది మీలాంటి పెద్దోళ్ళకి" అన్నాడు లాటరీలో కారును సంపాదించుకున్న పెద్దమనిషి.

"వద్దురా బాబూ, అది నువ్వు ఎక్కి ఈ వూర్లో దర్జాగా తిరుగుతుంటేనే మన పథకం బాగా పారేది. మంత్రిగారు తమాషాకన్నారు. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో, కారు ఎప్పుడు చూసినా తళతళ మెరిసిపోతుండాలి. రోజుకు కనీసం నాలుగయిదుసార్లన్నా నాలుగు వీధుల్ని చుట్టి వస్తుండాలి" మధుమూర్తి, ఓరగా సుందరమ్మకేసి చూస్తూ అన్నాడు.

అది రాత్రి పదిగంటల సమయం.

ఆర్. అండ్ బి బంగ్లా అది. బంగ్లా అంతా నిశ్శబ్దంగా వుంది. ఇప్పుడా హాల్లో మంత్రి పట్టాభి, సుందరి, మధుమూర్తి, మరో ఇద్దరు వ్యక్తులున్నారు.

"ఏంటి కొత్త యస్.పి. సంగతి? ఇవ్వాళ వెళ్ళాల్సిన రోజు. పంపించేయనా?" మధుమూర్తి సందేహిస్తూ అడిగాడు.

పట్టాభి మధుమూర్తి కేసి తీక్షణంగా చూశాడు.

"ఐతే పంపించేస్తాలే" అన్నాడు తన సందేహానికి సిగ్గుపడుతూ.

"పంపించు. మన వ్యవహారాల్ని యధాతథంగా కొనసాగించు. సరుకు తీసుకెళ్ళే డ్రైవర్ని వచ్చి ఓసారి నన్ను కలవమని చెప్పు" మంత్రి ధీమాగా అన్నాడు.

వెంటనే డ్రైవర్‌ని లోపలకు పిలిపించాడు మధుమూర్తి